క్లుప్తంగా

టోఫెల్ రెడీనెస్ పరీక్షకు 52 మంది హాజరు

బాడంగి: మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో చదువుతున్న 3,4,5వ తరగతి విద్యార్థులకు బుధవారం టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్) రెడీనెస్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే టోఫెల్ పరీక్షకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు హెచ్‌ఎం డి.సత్యనారాయణ చెప్పారు. ఈ పరీక్షలకు 52మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. శుక్రవారం 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న సుమారు 320 మంది విద్యార్థులకు టోఫెల్ రెడీనెస్ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

చురుగ్గా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులు

తెర్లాం: మండలంలోని పణుకువలస జంక్షన్ వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల యూటీఎఫ్ అధ్యక్షులు, ఉపాధ్యాయుడు గర్భాపు మునిస్వామి బుధవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పణుకువలస జంక్షన్‌లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో దీన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వంగర: మండలంలోని సంగాం గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.వి.జనార్దన్ బుధవారం తెలిపారు. వంగర పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగాం గ్రామానికి చెందిన 20ఏళ్ల యువకుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేజేరులో అగ్నిప్రమాదం



కాలిపోతున్న చెరుకు క్రషర్లు, పిప్పికుప్పలు

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బొమ్మినాయుని అప్పలనాయుడు, రాముకు చెందిన రెండు చెరుకు క్రషర్లు, పిప్పికుప్పలు కాలిపోయాయని సర్పంచ్ బొమ్మినాయుని వెంకటనాయుడు చెప్పారు. మిట్టమధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగిందని, ఎలా జరిగిందో స్పష్టంగా తెలియదన్నారు. క్రషర్లకు చెందిన ఇంజన్లు, షెడ్లు, బెల్లం తాయిలు, 80 బెల్లం రేకులు, దోనెలు, పిప్పికుప్పలు కాలిపోయినట్లు గుర్తించారు. సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాడంగి నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

13, 14 తేదీలల్లో పీఓలు, ఏపీఓలకు శిక్షణ

రాజాం: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే పీఓలు, ఏపీఓలకు ఈనెల 13, 14 తేదీల్లో విడివిడిగా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని రాజాం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్.జోసఫ్ బుధవారం తెలిపారు. ఈవీఎంల వినియోగం, ఓటింగ్ సక్రమంగా నిర్వహించే పద్ధతులుపై ఈ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే పీఓలకు, ఏపీఓలకు సమాచారం ఇస్తున్నామన్నారు.

ఎంఈఓ పరిశీలన

రేగిడి: మండలంలో మునకలవలస ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఆంగ్ల పరిజ్ఞాన పరీక్షలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థులు ఆంగ్ల అభ్యసన సామర్థ్యాలకు సంబంధించి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యావనరులు పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని బలరాంపేట గ్రామంలో ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నును ఒకేసారి చెల్లించడం ద్వారా రాయితీ పొందవచ్చునని అన్నారు. ఈ నెల 30లోగా సచివాలయాల్లోగానీ, మున్సిపల్ కార్యాలయంలోగానీ, ఆన్‌లైన్ ద్వారాగానీ చెల్లింపులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

ఫ్యాన్ గుర్తుతోనే రాష్ట్ర సంక్షేమం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్
- రేగిడిలో జోరందుకున్న వైఎస్సార్‌సీపీ ప్రచారం



రేగిడి: దేవుదళలో ప్రచారంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ పరిశీలకులు కేవీ సూర్యానారాయణ, తదితరులు

రేగిడి: ఫ్యాన్ గుర్తుతోనే రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. మండలంలో పెద్దపుర్లి, చిన్నపుర్లి, దేవుదళ, గోపింపేట, కొమెర, ఆడవరం, వన్నలి తదితర గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని వెల్లడించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ కూటమి నేతలు బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో చంద్రబాబునాయుడుకు ఓట్లు వేసి రాష్ట్ర ప్రజలు మోసపోయారని, ఆ తప్పు మళ్లీ జరగకుండా చూసుకోవాలని హితవుపలికారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా రాజేష్‌ని, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ని గెలిపించాలని నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కేవీ సూర్యానారాయణరాజు కోరారు. కొమెర గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కి గ్రామస్తులు కోలాట నృత్యంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలాట కళాకారులతో కలిసి రాజేష్ కూడా కోలాటం ఆడి పలువురిని ఆకర్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నెల్లి పెంటన్నాయుడు, సంకిలి సొసైటీ అధ్యక్షులు లావేటి వేణుగోపాలనాయుడు, ఎంపీటీసీలు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావులు, కురిటి రామకోడి, సర్పంచ్‌లు పాడి లక్షున్నాయుడు, కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం గోవిందరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, కుప్పిలి గవరయ్య, మాజీ ఎంపీటీసీ కెంబూరీ శ్రీహరిరావునాయుడు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



రేగిడి: కొమెర గ్రామంలో కోలాటం ఆడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



రాజాం: కూరాకుల వీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రాజాం: రానున్న ఎన్నికల్లో ఓటర్లంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ తలే రాజేష్‌ని, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు ఓటర్లను కోరారు. రాజాం పట్టణంలో శ్రీనివాసాకాలనీ, ఠాణావీధి, ఆసపువీధి వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్యతో కలిసి ఇంటింటికి వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా రాజేష్‌ని గెలిపించడం ద్వారా రాజాం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం వస్తుందని వివరించారు. పార్టీ రాజాం పట్టణ నాయకులు దూబ గోపాలం, ఆసపు సూర్యం, శాసపు వేణు, ముగడ రవి, పాలవలస శ్యామ్, దాసు, మోహన్, యందవ సుశీల, కోల్లా రమ్య, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

51 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓకు అందిస్తున్న గ్రామ వలంటీర్లు

వంగర: మండలంలోని వంగర, సంగాం, కొప్పరవలస, మద్దివలస, తలగాం, శివ్వాం గ్రామాలకు చెందిన 51 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.సాల్మాన్‌రాజ్‌కు తమ రాజీనామా పత్రాలను బుధవారం అందజేశారు. అనంతరం వారంతా మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు సేవ చేసేందుకు తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు అపహాస్యం చేశారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని వెల్లడించారు. అప్పట్లో వలంటీర్ వ్యవస్థను చిన్నచూపు చూసిన చంద్రబాబు ఎన్నికల్లో ఓట్లు కోసం వలంటీర్లపై కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మెయిన్‌రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి, ఎంపీ బెల్లాన

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం అమలవుతోందని, సంక్షేమ రాజ్యాన్ని కొనసాగించుకునేందుకు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని గొల్లపల్లిలో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా ర్యాలీగా వెళ్లి దాడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు సావు కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారానికి సహకరించాలని ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి కోరారు. అక్కడ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చరిత్రలో నిలిచే విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఒక్కటయ్యాయని, వారికి ఎల్లోమీడియా జతకలిసి ఎలాగైనా తమ ఉనికిని కాపాడుకోవాలని కుటిల పన్నాగాలను పన్నుతున్నాయన్నారు. వారి విష ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలంతా ఏకతాటి నిలవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకులు మావుడి ప్రసాదరావు నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, రాష్ట్ర ఆర్థిక మండలి సభ్యుడు తూముల భాస్కరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశీనాయుడు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి శంబంగి శ్రీకాంత్, పట్టణ, మండల ఇన్‌ఛార్జిలు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, స్థానిక నాయకులు తుట్ట తిరుపతి, మండల జనార్దనరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

మండల సమావేశం

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజు అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎలాంటి సమీక్ష నిర్వహించకుండా సమావేశం ముగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, మండల పరిషత్ ఏఓ రఘునాధాచారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

సంతకవిటి: ఉద్యోగులు నుంచి పోస్టల్ బ్యాలెట్‌లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 లోగా ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే బెడ్‌రిడ్ పేషెంట్ల సమాచారాన్ని సేకరించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టిపెట్టాలి

తెర్లాం: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని అన్ని పంచాయతీల్లో చెరువు పనులతో పాటు, ఉద్యానవన పంటల సాగుపై క్షేత్ర సహాయకులు దృష్టి సారించాలని ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉపాధి ఏపీఓ సుశీల ఆధ్వర్యంలో బుధవారం క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా జరుగుతున్న ఉపాధి పనులు, వేతనదారుల హాజరు, పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పనిచేసే ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగేలా ఫారంపాండ్‌ల తవ్వకాలు చేపట్టాలన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్మానం

తెర్లాం: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఎక్కువ మంది వేతనదారులకు 100 రోజులు పని కల్పించిన క్షేత్ర సహాయకులను బుధవారం సన్మానించారు. మండలంలోని గోపాలవలస, ఎం.ఆర్.అగ్రహారం, కొరటాం, ఎస్.బూర్జవలస, రాజయ్యపేట పంచాయతీలకు సంబంధించిన క్షేత్ర సహాయకులు ఆయా పంచాయతీల్లో ఎక్కువ మంది వేతనదారులకు 100రోజులు పని కల్పించారు. వారిని ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఉపాధి ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఓ సుశీల ఘనంగా సన్మానించారు. మిగిలిన క్షేత్ర సహాయకులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

12న దివ్యాంగ నిర్ధారణ శిబిరం

రాజాం సిటీ: ఈ నెల 12న స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు మెగా సహాయ పరికరాల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నామని ఎంఈఓలు పి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 18 సంవత్సరాలలోపు చిన్నారులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో తనిఖీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. శారీరక వైకల్యం, స్పర్శలేకపోవడం, వినికిడి లోపంతో పాటు ఇతర వైకల్యాలతో బాధపడుతున్న వారికి తనిఖీలు చేసి అవసరమైన వారికి సంబంధిత పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల పంపిణీ

రాజాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులకు, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు బుధవారం క్రోధినామ సంవత్సర త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీ రచించిన తెలుగు కాలసూచికలో భగవద్గీత వచనాలను జోడించి క్యాలెండర్ రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం అధ్యక్షుడు రామినాయుడు, సభ్యులు కె.గణేష్, కె.ప్రసాద్, జె.పాపారావు, జె.రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మస్టర్ల నమోదు

బాడంగి: ఉపాధిహామీ పనులకు హాజరవుతున్న వేతనదారుల మస్టర్లను సక్రమంగా నమోదు చేయాలని, అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తప్పవని రాజాం క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసరావు అన్నారు. స్థానక ఉపాధి కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రోజువారీ మస్టర్ల నమోదు, వంద రోజులు పని పూర్తయిన వారి వివరాలు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనులు, తదితర అంశాలపై ఆరా తీశారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా పని ప్రదేశంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పీఓ ఆంజనేయులు, ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేయాలి

రాజాం: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడేలా ఉండాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. వేసవి ఎండలు ఎక్కువుగా ఉన్నందున ఉదయం 6 నుంచి 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటలు తరువాత పనులు చేపట్టాలని సూచించారు. పనుల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, తాటాకుల షెడ్డుల నిర్మాణం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, ఈసీ బి.శ్రీరామమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బాడంగి: విజయనగరంలో గురువారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తెంటు మధుసూదనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు పిలుపునిచ్చారు.

స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి వెళ్లేందుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 8.30 గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని, ఇక్కడ నుంచి బస్సు బయలుదేరి వెళ్తుందన్నారు. విస్తృత స్థాయి సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ప్రత్యేక ఉపాధ్యాయుడికి ప్రశంసలు



ఎస్ఎస్ఏ అధికారుల నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సునీల్

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పి.సునీల్ సేవలను సమగ్ర శిక్ష, సహిత విద్య రాష్ట్ర, జిల్లా అధికారులు ప్రశంసించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులకు రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ట్యాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడంపై 'విజన్–2025–ఇన్‌క్లూజివ్ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఇటీవల ప్రభుత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష రాష్ట్రకీ రీసోర్స్‌పర్సన్‌గా తెర్లాం హైస్కూల్‌లో ప్రత్యేక ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సునీల్ వ్యవహరించారు. సునీల్ సేవలను గుర్తించిన సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఏపీడీ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పరిశీలకులు రామ్‌కమల్, అధికారి డాక్టర్ వై.నరసింహం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సునీల్‌ను సమగ్ర శిక్ష జిల్లా అధికారులు, తోటి ప్రత్యేక ఉపాధ్యాయులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది బుధవారం సునీల్‌ను అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు పొందిన విద్యార్థులతో వాసవీక్లబ్ సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'వాసవీక్లబ్ మన రాజాం–సారథి' ఎప్పుడు ముందుంటుందని ఆ సంఘం అధ్యక్షుడు గ్రంధి జగన్ అన్నారు. విద్యలో రాణిస్తున్న పలువురు విద్యార్థులకు స్థానిక వాసవీ కల్యాణ మండపం ఆవరణలో బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల్లో పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే వివిధ రంగాల్లో సేవలందించిన వారికి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రవికుమార్, నవీన్, వాకచర్ల రాజా, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమంతా వైఎస్సార్‌సీపీ వెంటే..



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- విరాళాలు ఇస్తామని పిలిచి టీడీపీ కండువాలు వేశారు
- ఎమ్మెల్యే శంబంగితో తారకరామా కాలనీ కార్యకర్తలు

బొబ్బిలి: తమ ఇలవేల్పు అయిన దేశమ్మతల్లి పండగ విరాళం ఇస్తామని చెప్పి కోటలోకి రమ్మన్నారని, తీరా వెళ్తే తమకు టీడీపీ కండువాలు వేశారని తారకరామా కాలనీకి చెందిన 15 కుటుంబాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వారందరికీ ఎమ్మెల్యే శంబంగి పార్టీ కండువాలు వేశారు. గొల్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో 30, 31వ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సమయంలో టీడీపీ నాయకులు ఆ వార్డులకు చెందిన (తారకరామా కాలనీ) కొంతమందిని దేశమ్మతల్లి పండగకు విరాళం ఇస్తామని రమ్మన్నారు. వారు వెళ్లేసరికి అక్కడ కండువాలతో రెడీగా ఉండి వారికి కండువాలు వేశారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ వాడపల్లి మనోజ్‌కుమార్ ఆరా తీయగా తాము పార్టీలో చేరలేదని, వారే బలవంతంగా కండువాలు వేశారని వారంతా చెప్పారు. వెంటనే మీరంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావాలని చెప్పగా వారే వచ్చి ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. తాము వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని వారంతా స్పష్టం చేశారు. నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌ఛార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, కౌన్సిలర్‌లు వనజ కుమారి, రాజగోపాల నాయుడు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



రాజాం సిటీ: గెడ్డవలసలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు



వంగర: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ నాయకులు

రాజాం సిటీ: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మండలంలోని గెడ్డవలస గ్రామంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి డాక్టర్ తలే రాజేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీరంగం, పీఏసీఎస్ డైరెక్టర్ ముదిలి జనార్దనరావు, నక్క ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, బింగి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

వంగర: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు అన్నారు. మండల కేంద్రం వంగర, అరసాడలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. టీడీపీ కూటమి చేస్తున్న వాగ్దానాలు, మాయమాటలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిశర్ల విజయలక్ష్మి, బొక్కెల వెంకటప్పలనాయుడు, కాబోతుల శ్రీనివాసునాయుడు, కిమిడి సన్యాసినాయుడు, యలకల వాసునాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలి

బాడంగి: మండలంలో ఎన్నికల కోడ్ మరింత పటిష్టంగా అమలు కావాలంటే అధికారులు సమన్వయంతో పనిచేయాలని మోడల్ కోడ్‌ఆఫ్ కండక్టు పర్యవేక్షణాధికారి, ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై ఎన్నికల కోడ్ అమలుపై పలు సూచనలు చేశారు. కోడ్ అమలుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. గ్రామాల్లో మద్యం, నగదు, బహుమతులు పంపిణీపై నిఘా పెట్టాలని సూచించారు. రూ.50 వేలకు పైబడి నగదు తీసుకువెళ్తూ పట్టుబడితే నగదుకు తగిన ఆధారాలు చూపాలన్నారు. ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ మాట్లాడుతూ కార్యదర్శులు విధిగా పంచాయతీ కరెంటు బిల్లులు చెల్లించాలని, ఫ్యూజులు పీకేసిన తరువాత చెబితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు లేకుండా చెల్లించాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.